క్లుప్తంగా

ఉపాధ్యాయ సమస్యలపై సీఎం, సీఎస్‌కు మెయిల్స్

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ న్యాయమైన ఆర్థిక డిమాండ్ల సాధనకు ఏపీటీఎఫ్ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన నిరసన వారంలో భాగంగా చివరి రోజైన బుధవారం ముఖ్యమంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఈ–మెయిల్ ద్వారా సందేశాలు పంపినట్లు సంఘ జిల్లా అధ్యక్షుడు కె.బసవ లింగారావు తెలిపారు. జిల్లా కోర్టు ఎదుట ఉన్న ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో సంఘ నాయకులు, ఉపాధ్యాయులతో కలిసి సీఎం, సీఎస్‌కు ఈ–మెయిల్స్ పంపారు. కార్యక్రమంలో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ ఖాలీద్, జిల్లా కార్యదర్శి జి.దాస్, ఆడిట్ కమిటీ సభ్యులు వి.కిషోర్ షా, జిల్లా కౌన్సిలర్లు కె.శ్రీనివాసరావు, పి.వేణుగోపాలరావు పాల్గొన్నారు.

దేశంలో పెరుగుతున్న కమ్యూనిస్టుల బలం

లక్ష్మీపురం: ప్రపంచ పరిణామాల నేపథ్యంలో దేశంలో కమ్యూనిస్టుల బలం పుంజుకుంటుందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ పేర్కొన్నారు. కొత్తపేట సీపీఐ జిల్లా కార్యాలయం మల్లయ్య లింగం భవన్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ భయపడి వణికి పోతున్నాడని చెప్పారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా కమ్యూనిస్టులకు నక్సలైట్లకు మధ్య తేడా గమనించలేకపోతున్నారని ధ్వజమెత్తారు. సమావేశంలో పార్టీ నాయకులు జంగాల అజయ్ కుమార్, కోట మాల్యాద్రి, మేడా హనుమంతరావు, ఆకిటి అరుణ్ కుమార్, రావుల అంజిబాబు పాల్గొన్నారు.

పెరియార్ రామస్వామి ఆదర్శనీయులు

నెహ్రూనగర్: బహుజనుల పక్షాన పోరాటం చేసిన మహనీయుడు పెరియార్ రామస్వామి ఆదర్శనీయులని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక, జన సేవాసంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం పెరియార్ రామస్వామి జయంతి సందర్భంగా అరండల్ పేటలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ అందరి ఓటు హక్కు కావాలని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ తీసుకొచ్చిన నినాదానికి మద్దతు పలికారన్నారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు జి.ఆర్.భగత్‌సింగ్, సాంబయ్య, రామారావు, సాంబశివరావు, విశ్రాంత తహసీల్దారు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సమీక్షా సౌరభాలు పుస్తకావిష్కరణ



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వర దేవాలయం పద్మావతీ కళ్యాణ వేదికపై నాగరాజ్యలక్ష్మి రచించిన సమీక్షా సౌరభాలు గ్రంథావిష్కరణ సభ బుధవారం నిర్వహించారు. సభకు టి.జె.పి.ఎస్. కళాశాల పూర్వ ప్రధానాధ్యాపకురాలు డాక్టర్ టి.రాధాబాయి అధ్యక్షత వహించారు. ప్రముఖ విమర్శకులు రావెల సాంబశివరావు గ్రంథావిష్కరణ చేసి, ఆమె నిరంతర సాహితీ కృషిని అభినందించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ యశస్వి రమణ మాట్లాడారు. గ్రంథ సమీక్ష ప్రముఖ కవి డాక్టర్ బీరం సుందరరావు చేశారు.మాట్లాడుతూ రచయిత్రి, కవయిత్రి, విమర్శకురాలు, వ్యాఖ్యాతగా నాగరాజ్యలక్ష్మి అపారమైన కృషి చేస్తున్నారని అన్నారు. సారస్వత కళానిధి బిరుదాంకితురాలు డాక్టర్ వెలువోలు నాగరాజ్యలక్ష్మి బహుముఖ ప్రజ్ఞాశాలి అని వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.లలితకుమారి, ఆర్.రంగారావు పాల్గొన్నారు.

వావిలాల జయంతి

లక్ష్మీపురం: నిస్వార్థ ప్రజా సేవకు జీవితాన్ని త్యాగం చేసిన త్యాగశీలి వావిలాల గోపాలకృష్ణయ్య అని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అన్నారు. గుంటూరు అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో బుధవారం వావిలాల గోపాలకృష్ణయ్య జయంతి నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. విద్యావేత్త ఇ.చంద్రయ్య మాట్లాడుతూ ప్రజా సమస్యలపై అలుపెరగకుండా ఎనిమిది దశాబ్దాల పాటు అవిశ్రాంతం పోరాటం జరిగిన మహోన్నత గాంధేయ వాది మచ్చలేని ప్రజా ప్రతి నిధి అన్నారు.

డయేరియా బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో డయేరియా బాధితులను తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్ బుధవారం పరామర్శించారు. బాధితుల ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందనే విషయాలను ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో ప్రతి ఒక్కరిపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని ఈ సందర్భంగా సూపరింటెండెంట్ రమణకు సూచించారు.

కార్పొరేషన్ ఆదాయానికి ఎసరు

- టీడీపీ కార్యకర్తల పరిధిలో కమ్యూనిటీ హాల్స్, కళ్యాణమండపాలు
- ఇటీవల వేలం ప్రకటన
- ఎమ్మెల్యేల జోక్యంతో నిలిచిపోయిన వేలం



మదర్ థెరిస్సా కమ్యూనిటీ హాల్



వేలం ప్రకటన

నెహ్రూనగర్: కార్పొరేషన్‌పై ఆధిపత్యం చేలాయిస్తున్నారు. టీడీపీ కార్యకర్తల ఆదాయ వనరుగా మారింది. ప్రతి అంశంలో దోచుకునేందుకు కుట్రపన్నుతున్నారు. కమ్యూనిటీ హాల్స్, కళ్యాణ మండపాలకు వేలాన్ని అడ్డుకుంటున్నారు. ఈ నెల 16వ తేదీన బహిరంగ వేలం నిర్వహణ ప్రకటన వెలువడింది. అయితే కార్యకర్తలకు నష్ట జరుగుతుందని ఎమ్మెల్యేలు వాటికి వేలం నిర్వహించకుండా నిలిపివేయించినట్లు సమాచారం.

కమ్యూనిటీ హాల్స్, కళ్యాణ మండపాలు ఇలా...

నగరపాలక సంస్థ పరిధిలో శ్రీకృష్ణ కళ్యాణ మండపం, మదర్‌థెరిస్సా కమ్యూనిటీ హాల్, కాపు కమ్యూనిటీ హాల్(ఏసీ), లాల్‌జాన్ బాషా షాదీఖానాతో కలిపి మొత్తం 4 ఉన్నాయి. ఈ నాలుగు తెలుగు తమ్ముళ్లు, కార్పొరేటర్ల ఆధీనంలో ఉన్నాయి. వీటి ద్వారా భారీ స్థాయిలో వచ్చే ఆదాయాన్ని వారి వారి జేబుల్లో వేసుకుని కార్పొరేషన్‌కు తూతూ మంత్రంగా చిల్లర విదిలిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. వేలం పాట నిర్వహించాలనే ఉద్దేశంతో ప్రకటన విడుదల చేశారు. సెప్టెంబర్ 20, 2025 నుంచి సెప్టెంబర్ 19, 2026 వరకు అంటే ఏడాది పాటు నిర్వహించేందుకు గాను చర్యలు చేపట్టారు. శ్రీకృష్ణ కళ్యాణమండపానికి రూ.3,53,510, మథర్ థెరిస్సా కమ్యూనిటీ హాల్ రూ.3,51,450, కాపు కమ్యూనిటీ హాల్(ఏసీ)కి రూ.4,80,000, లాల్‌జాన్ బాషా షాదిఖానా రూ.1,50,000 చొప్పున సంవత్సరానికి అద్దె ఖరారు చేసి..ఈ నెల 16న వేలం పాట నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ క్రమంలో తెలుగు తమ్ముళ్లు ఎమ్మెల్యేలపై తీవ్ర స్థాయిలో ఒత్తిళ్లు తీసుకువచ్చినట్లు సమాచారం.

ఈ నెల16న స్వచ్ఛభారత్ బృంద సభ్యులు గుంటూరు వచ్చిన నేపథ్యంలో వేలం పాట నిలిపివేస్తున్నట్లు తిరిగి వేలం పాట నిర్వహణ తేదీలను ప్రకటిస్తామని వెల్లడించారు.

రూపాయి వస్తే ఒట్టు!

శ్రీకృష్ణ కళ్యాణ మండపం ఓ టీడీపీ కార్పొరేటర్ చేతుల్లో ఉంది. కాపు కమ్యూనిటీ హాల్, మదర్ థెరిస్సా కమ్యూనిటీ హాల్ కూడా టీడీపీ తమ్ముళ్ల చేతుల కిందే ఉన్నాయి. ఈ మూడింటికి నెలలకు రూ.లక్షల్లో ఆదాయం వస్తుంటే కార్పొరేషన్‌కు జమ అయ్యేది కేవలం వేలల్లో. ఈ మూడింటి తరుపున ఎంతో కొంత నగదు జమ అవుతుంటే లాల్ జాన్ బాషా షాదీఖానా ఎమ్మెల్యే తమ్ముడు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

తాళాలు వీరి దగ్గరే..

సదరు కమ్యూనిటీ హాల్స్, కళ్యాణ మండపాలకు సంబంధించిన తాళాలు నగరపాలక సంస్థ సిబ్బంది వద్దే ఉండాలని స్పష్టమైన ఆదేశాలున్నప్పటికి ఆ తాళాలు మాత్రం ఒకటి కార్పొరేషన్ సిబ్బంది వద్ద, మరొకటి తమ్ముళ్ల వద్దే ఉంచుకుని వారికి అవసరమైనప్పుడు వాటికి అద్దెలకు ఇచ్చుకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. గతంలో కూడా డాక్టర్ కొల్లి శారదా హోల్‌సేల్ కూరగాయాల మార్కెట్ వేలం పాట నిర్వహిస్తున్నామని ప్రకటించి తిరిగి కుంటి సాకులు చూపి వాటిని కొన్ని రోజుల పాటు వేలం పాట జరగకుండా ఆపేశారు. దీనిపై సాక్షిలో వరసగా కథనాలు ప్రచురించడంతో కార్పొరేషన్ అధికారులు వేలం పాట నిర్వహించడం ద్వారా కార్పొరేషన్‌కు ఎన్నడూ లేని విధంగా రూ.6 కోట్లు పైచిలుకు ఆదాయం సమకూరింది. కమ్యూనిటీ హాల్స్, కళ్యాణ మండపాలకు కూడా వేలం పాట నిర్వహిస్తే కార్పొరేషన్ మరింత ఆదాయం సమకూరుతుందని నగర వాసులు అభిప్రాయపడుతున్నారు.

ఔషధ మార్కెటింగ్‌కు ముందుగా క్లినికల్ ట్రయల్స్ కీలకం

డాక్టర్ ఎస్.రఘు



జాతీయ ఫార్మకోవిజిలెన్స్ వారోత్సవాల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డాక్టర్ రఘు, నాగభూషణం

గుంటూరు ఎడ్యుకేషన్: నూతన ఔషధాలను మార్కెట్లోకి అనుమతించే ముందుగా నిర్వహించే క్లినికల్ ట్రయల్స్ ఎంతో కీలకమని ప్రభుత్వ జ్వరాల ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.రఘు పేర్కొన్నారు. బుధవారం అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో ఫార్మసీ ప్రాక్టీసు, ఫార్మకాలజీ విభాగాలు సంయుక్తంగా 5వ జాతీయ ఫార్మకోవిజిలెన్స్ వారోత్సవాలను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ రఘు మాట్లాడుతూ క్లినికల్ ట్రయల్స్‌లో కొంత మంది స్వచ్ఛంద సేవకులపై జరిపే పరీక్షల ఫలితాలపై ఆధారపడి మార్కెటింగ్ అనుమతులు ఇస్తారని, తరువాత ఎక్కువ మంది రోగులకు వాడినప్పుడు కలిగే అవాంఛనీయ దుష్ప్రభావాలను తెలుసుకుని వాటి నివారణకు ఫార్మకోవిజిలెన్స్ ఆఫ్ఇండియా సహాయ పడుతుందని వివరించారు. ఫార్మసీ విద్యార్థులు, అధ్యాపకులు, వైద్యులు, ప్రజలు ఆయా అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కళాశాల ఫార్మకాలజీ విభాగాధిపతి డాక్టర్ డి.బ్రహ్మ శ్రీనివాసరావు మాట్లాడుతూ భారతీయ ఔషధ నియంత్రణ సంస్థ వివిధ పీవీపీఐ కేంద్రాల నుంచి సేకరించిన సమాచారాన్ని విశ్లేషించి, ఔషధాల దుష్ప్రభావాల నియంత్రణకు తగిన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కళాశాల పీవీపీఐ సమన్వయకర్త డాక్టర్ ఎన్.హేమకుమారి మాట్లాడుతూ ఎరిత్రోమైసిన్ మొదటిసారి వినియోగించినప్పుడు కలిగిన దుష్ప్రభావాలను గురించి విద్యార్థులకు వివరించారు. ఈసందర్భంగా జాతీయ ఫార్మకోవిజిలెన్స్ వారోత్సవాల పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం, ఫార్మా.డి డైరెక్టర్ డాక్టర్ పి. సీతారామయ్య, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ప్రత్యూష పాల్గొన్నారు.

పెండింగ్‌లోని క్లెయిమ్‌లను వెంటనే పరిష్కరించాలి

లక్ష్మీపురం: ఆంధ్రప్రదేశ్ భవన, ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డులో పెండింగులో ఉన్న క్లెయిమ్‌లను వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు పుప్పాల సత్యనారాయణ డిమాండ్ చేశారు. పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి కార్యాలయంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏపీ భవన, ఇతర నిర్మాణ సంక్షేమ బోర్డులో సభ్యులుగా ఉన్న కార్మికులు తమకు హక్కుగా రావాల్సిన సంక్షేమ పథకాల కోసం పెట్టుకున్న దాదాపు 50 వేల క్లెయిమ్‌లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. తక్షణమే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

దేశ స్థితి గతులు మార్చిన ప్రధాని మోదీ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, కలెక్టర్ తమీమ్ అన్సారియా

గుంటూరు మెడికల్: జిల్లాలో స్వస్థ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్ర శేఖర్, గుంటూరు వైద్య కళాశాలలో బుధవారం ప్రారంభించారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ జన్మ దినోత్సవం సందర్భంగా కార్యక్రమం ప్రారంభించడం సంతోషదాయకమన్నారు. దేశ స్థితిగతులు మార్చిన వ్యక్తి ప్రధాన మంత్రి అని పేర్కొన్నారు. కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా మాట్లాడుతూ స్వస్థ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్య అవగాహన శిబిరాలు నిర్వహిస్తారన్నారు. ఏపీ ఎం.ఎస్.ఐ.డి.సి మేనేజింగ్ డైరెక్టర్ గిరీషా మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ హెనీక్రిస్టినా, డెప్యూటీ మేయర్ షేక్ సజీల, సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ వి.హరిబాబు నాయుడు, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.వి.సుందరాచారి, తులసి సీడ్స్ అధినేత రామచంద్ర ప్రభు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ పాల్గొన్నారు.

కాచి చల్లార్చిన నీరు తాగాలి

నెహ్రూ నగర్: నగరంలో నమోదవుతున్న అతిసార కేసులకు నగర పాలక సంస్థ తాగు నీరు కారణం కాదని, కలుషిత ఆహారం వలన కారణమని బుధవారం గుంటూరు జిల్లా సర్వజనాసుపత్రి వైద్యులు నిర్ధారించారని, ప్రజలు ఎటువంటి అపోహలకు గురికావద్దని, ప్రజలు కాచి చల్లార్చిన నీరు తాగాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని కొన్ని ప్రదేశాల నుండి అతిసార లక్షణాలతో జీజీహెచ్‌కు గత కొద్ది రోజుల్లో రోగులు చేరిన సమాచారం తెలిసిన వెంటనే, నగర పాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులతో బాధిత గృహాలకు సరఫరా చేస్తున్న తాగునీటి పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. నగరంలో తాగు నీరు రంగుమారినా, దుర్వాసన వచ్చిన వెంటనే నగర పాలక సంస్థ కాల్ సెంటర్ నెంబర్ 0863 2345103 కు ఫిర్యాదు చేయాలని కమిషనర్ కోరారు.

డ్రెయిన్లపై ఆక్రమణలను వెంటనే తొలగించాలి

నెహ్రూనగర్: నగరంలో డ్రెయిన్లను ఆక్రమణ చేసి చేపట్టిన నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికన తొలగించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. బుధవారం జీజీహెచ్ దగ్గరలోని సెయింట్ జోసఫ్ స్కూల్‌లో వర్షం నీరు నిలిచిందనే ఫిర్యాదు మేరకు కమిషనర్ సదరు స్కూల్‌ని పరిశీలించి, స్కూల్ ఎదుట డ్రెయిన్లపై ఆక్రమణలను తొలగింపజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ డ్రెయిన్ల ఆక్రమణ ఎంత సమస్యగా ఉంటుందో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల వలన రోడ్ల మీదకు, ఇళ్లల్లోకి వచ్చిన వర్షం నీరు చూస్తే తెలుస్తోందని చెప్పారు.

పురుషులకంటే మహిళల్లోనే పక్షవాతం ఎక్కువ

డాక్టర్ పమిడి ముక్కల విజయ



గుంటూరు మెడికల్: పురుషులకంటే మహిళల్లోనే పక్షవాతం (బ్రెయిన్ స్ట్రోక్) ఎక్కువగా వస్తుందని, ఆరుగురు పురుషుల్లో ఒకరు పక్షవాతం బారిన పడుతుండగా, ఐదుగురు మహిళల్లో ఒకరు వ్యాధి బారిన పడుతున్నట్లు ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ ప్రెసిడెంట్, లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ పడిమిడి ముక్కల విజయ అన్నారు. బుధవారం గుంటూరు కొత్తపేటలోని లలితా హాస్పిటల్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. సెప్టెంబర్ 12 నుంచి 15 వరకు జపాన్‌లోని హ్యోగో మెడికల్ యూనివర్సిటీలో అంతర్జాతీయ ఆసియా పసిఫిక్ స్ట్రోక్ కాన్ఫరెన్స్ వివరాలను వెల్లడించారు. త్వరితగతిన పక్షవాత నిర్ధారణ, పక్షవాత నివారణ, అత్యవసర చికిత్సల కోసం పని చేస్తున్న అతిపెద్ద అంతర్జాతీయ వేదికల్లో పాల్గొని భారత దేశం తరుపున మాట్లాడటం చాలా గర్వంగా ఉందన్నారు.

తురకపాలెం సందర్శన

లక్ష్మీపురం: తురకపాలేన్ని కాంగ్రెస్ పార్టీ ప్రతినిధుల బృందం బుధవారం సందర్శించింది. కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్‌వలి మాట్లాడుతూ గడచిన మూడు నాలుగు నెలలుగా దాదాపుగా 30 నుంచి 40 మంది మరణించిన దురదృష్టకరమని చెప్పారు. ప్రభుత్వం నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మస్తాన్‌వలి, లింగం శెట్టి ఈశ్వరరావు, చిలకా విజయ్ పాల్గొన్నారు.

వర్గీకరణ ఆర్డినెన్స్‌కు చట్టబద్ధత కల్పించాలి

నెహ్రూనగర్: ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టి ఆర్డినెన్స్‌కు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చందోలు శశికుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 16 ఏప్రిల్, 2025న రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వర్గీకరణ ఆర్డినెన్స్ కాలపరిమితి ఆరునెలలే కాబట్టి సదరు కాలపరిమితి అక్టోబర్ నెలతో ముగుస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే అసెంబ్లీలో బిల్లుపెట్టి ఆర్డినెన్స్‌కు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు.

GENERAL NOTICE

IN THE COURT OF THE I ADDL.CIVIL JUDGE (SENIOR DIVISION)::GUNTUR

I.P No: 3 / 2025

BETWEEN :
Munnangi Sankar Babu,S/o.Bullaiah,R/o.Flat No.401, Mahaveer Villa,Vasavi Nagar, Main Road, Guntur. .... Petitioner
And
1)Devara Rajesh,S/o.Not known to the petitioner, R/o.Opp. Indian Bank, 4th lane, Butchaiahthota, Guntur,2) T.Sankar, S/o. Not known to the petitioner, R/o.Opp.H.P.Petrol Bank, Kakanithota, Pedakakani(Vil&Md),Guntur Dt.,3)Shaik Firoz, S/o. Not known to the petitioner, R/o.Yadavula Bazar, Old Guntur, Guntur, 4)Ameerkhan Pathan,S/o.not known to the petitioner, R/o. 4th lane, Rajeev Gandhi Nagar, Guntur,5)Veera Swamy,R/o.not known to the petitioner R/o. Sivalayam Street, 10th lane, Nehru Nagar, Guntur, 6)Vanchala Venkateswara Rao,S/o.not known to the petitioner,R/o.1st lane, Nehru Nagar, Guntur,7) Uppalapati Kodanda Rami Reddy,S/o.not known to the petitioner, R/o. Gujjanagundla, Main Road, Guntur, 8)Karasani Srinivas Reddy, S/o.not known to the petitioner, R/o.Near Park, Kontepadu, Guntur. 9)Chandu Srinivasa Rao, S/o.not known to the petitioner, R/o.Ananthavarapadu(Vil&Md)Guntur Dt.,10) T.Sudhakar Yadav, S/o.not known to the petitioner, R/o.6/1, Arundelpet, Guntur, Guntur,11)D.S.S.Kishore,S/o.not known to the petitioner,R/o.Near Jute Mill, Pattabhipuram, Guntur, 12) Pattabandla Chandrasekhar,S/o.not known to the petitioner, R/o. 4th lane, Butchaiahthota, Guntur,13)Sikha Srinivasa Kumar, S/o. not known to the petitioner, R/o.6th lane, Nehru Nagar, Guntur, 14)Ponnuru Uma Devi, D/o.name not known to the petitioner, R/o.near Potturu, Kakani Sivalayam temple,Pedakakani (Vil&Md),Guntur Dt.,15)Kuppuraveri Sandhya Rani,D/o.not known to the petitioner,R/o.4th lane, Nehru Nagar, Guntur, 16) Setty Sudhakar,S/o.Not known to the petitioner,R/o.1st lane, Vidya Nagar, Guntur,17)Sikha Babu,S/o.not known to the petitioner, R/o.7th lane, Nehru Nagar, Guntur, 18)A.Bhaskara Rao, S/o.not known to the petitioner, R/o.Opp.Cable Office,1st lane, Butchaiahthota, Guntur, 19)Akula Venkateswarlu,S/o.not known to the petitioner,R/o.1st lane, Lakshmipuram, Guntur, 20) Tirumalasetti Srinivas,S/o.not known to the petitioner,R/o.4th lane, Arundelpet, Guntur, 21)S.Srinivasa Reddy,S/o.Not known to the petitioner, R/o.1st lane, Srinagar, Guntur, 22) The Official Receiver,Court Compound, Guntur. ....Respondents

[illegible] తేది:29-09-2025 [illegible] 10:30ని.లకు [illegible] (శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు).

వాయిదా తేది:29-09-2025.

యేటుకూరి సుబ్బారావు, పిటీషనరు తరుపు అడ్వకేట్, గుంటూరు, సెల్: 96184 09678

భారతి సిమెంట్‌తో నాణ్యత, మన్నిక



మేస్త్రీకి బీమా బాండ్ అందజేస్తున్న సురేష్, భవానీ శంకర్, గాంధీకుమార్

నెహ్రూనగర్: శాశ్వత భవన నిర్మాణ కోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి తయారు చేసిన నాణ్యమైన భారతి సిమెంటును ఎంచుకోవాలని అసిస్టెంట్ మేనేజర్(మార్కెటింగ్) పూల సురేష్, సీనియర్ టెక్నికల్ ఆఫీసర్ ఎన్ భవానీ శంకర్ సూచించారు. నగరాలులోని సాయి ఎంటర్‌ప్రైజెస్ సహకారంతో భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో భవన నిర్మాణ మేస్త్రీలు, కార్మికులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ మేనేజర్ సురేష్ మాట్లాడుతూ అధునాతన పరిజ్ఞానంతో భారతి సిమెంటు తయారవుతుందని తెలిపారు. కట్టడాలు పూర్తి నాణ్యతతో దీర్ఘకాలం మన్నేందుకు దోహదపడుతుందని చెప్పారు. సిమెంట్ తయారీకి నాణ్యమైన ముడి పదార్థాలనే తమ కంపెనీ ఎంచుకుంటుందని పేర్కొన్నారు. టెక్నికల్ ఆఫీసర్ భవానీశంకర్ మాట్లాడుతూ భారతి సిమెంటుతో కాంక్రిట్‌తో వేసిన శ్లాబుల్ని ఏడు రోజుల అనంతరం తమ కంపెనీ ప్రతినిధులు వచ్చి నాణ్యత పరీక్షలు చేస్తారన్నారు. సిమెంటు నాణ్యతను భవన నిర్మాన మేస్త్రీలు, యజమానులకు వివరిస్తామని చెప్పారు. మేస్త్రీలకు సందేహాల్ని నివృత్తి చేశారు. సదస్సుకు హాజరైన మేస్త్రీలు, కార్మికులకు రూ.లక్ష చొప్పున ఉచిత బీమా సదుపాయం కల్పించి, బాండ్లను అందజేశారు. కార్యక్రమంలో ఎంటర్‌ప్రైజెస్ యాజమాని పి.గాంధీకుమార్ పాల్గొన్నారు.

ఘనంగా ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, బీజేపీ నేతలు

గుంటూరు మెడికల్: ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలు గుంటూరు జిల్లాలో పలు చోట్ల బుధవారం ఘనంగా నిర్వహించారు. పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు పాల్గొన్నారు. పట్నంబజారు భారత్ కేఫ్ వద్ద తూర్పు అసెంబ్లీ 15వ మండల అధ్యక్షుడు మల్లాల లక్ష్మణ్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నజీర్, వల్లూరు జయప్రకాష్ నారాయణ, జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతి రావు పాల్గొని కేకు కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. గుంటూరు నాజ్ సెంటర్ సర్కిల్ లో స్వచ్ఛ భారత్ కార్యక్రమం డాక్టర్ శనక్కాయల ఉమా శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. భారతీయ జనతా యువ మోర్చా గుంటూరు జిల్లా అధ్యక్షుడు మైలా హరికృష్ణ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ, గుంటూరు జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతి రావు హాజరై రక్త దాన శిబిరం ప్రారంభించారు. లక్ష్మీపురంలోని అభ్యుదయ మహిళా కాలేజీలో రక్తదానం చేస్తున్న విద్యార్థినులను అభినందించారు.

ఘనంగా ప్రధాని మోదీ జన్మదినం

గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో బుధవారం ప్రధాని నరేంద్రమోదీ 75వ జన్మదినం సందర్భంగా కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం, ఫార్మా.డి డైరెక్టర్ డాక్టర్ పి. సీతారామయ్య, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ప్రత్యూష పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళి

లక్ష్మీపురం: మతోన్మాదానికి, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సీతారాం ఏచూరి స్ఫూర్తితో పోరాడాలని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. గుంటూరు బ్రాడీపేటలో సీపీఎం కార్యాలయంలో ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి దివంగత సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభ బుధవారం నిర్వహించారు. సభకు పార్టీ జిల్లా కార్యదర్శి వై.నేతాజి అధ్యక్షత వహించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ ఏచూరి మతోన్మాదంపై, సామ్రాజ్యవాదంపై చివరి శ్వాస వరకూ పోరాడారన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వానికి ప్రజాస్వామ్యంపై, రాజ్యాంగంపై గౌరవం లేదని, సమాఖ్య విధానానికి తూట్లు పొడుస్తుందన్నారు. ఏపీకి విభజన హామీలు అమలు చేయకుండా ఏపీ ప్రజల గుండెల్లో గునపాలు దించిన బీజేపీ, ప్రజల గుండెల్లో ఉందని నడ్డా చెప్పటం హాస్యాస్పదంగా ఉందన్నారు. విశాఖ ఉక్కును నిర్వీర్యం చేస్తున్నారని, పోలవరం నిర్వాసితులకు, రాజధానికి, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధులు ఇవ్వట్లేదన్నారు. అటువంటి పార్టీని రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు భుజాన మోస్తూ ప్రజల్ని మోసం చేస్తున్నాయని విమర్శించారు. దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.భావన్నారాయణ, ఈమని అప్పారావు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ విజిలెన్స్ తనిఖీలు

నగరంపాలెం: విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగం, ఆపరేషన్ విభాగం సంయుక్తంగా బుధవారం డీ 3–గుంటూరు సెక్షన్ పరిధిలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో 58 మంది అధికారులు, 174 మంది సిబ్బంది 58 బృందాలుగా ఏర్పడి 4,228 సర్వీసులను పరిశీలించారు. అనుమతుల్లేని కేటగిరిలో విద్యుత్ వాడుతున్న ఇద్దరికి రూ.30 వేలు, అదనంగా విద్యుత్ వినియోగిస్తున్న 113 మందికి రూ.3.15 లక్షల అపరాధ రుసుం విధించారు. విద్యుత్ చౌర్యం సామాజిక నేరమని తెలిపారు. విద్యుత్ చౌర్యంపై 9440812263, 9440812361 నంబర్లకు ఫిర్యాదు చేయవచ్చునని అన్నారు. తనిఖీల్లో ఏఈ సీహెచ్.వెంకటేశ్వరరావు, డీపీఈ ఆపరేషన్ ఏఈ టి.శ్రీనివాస బాబు, డి.వెంకన్న చౌదరి(విజిలెన్స్ సీఐ), ఆపరేషన్ విభాగ డీఈఈ షేక్.ముస్తాక్‌అహ్మద్, డీపీఈ(విజిలెన్స్) డీఈఈ కె.రవికుమార్, ఎస్.మల్లికార్జున ప్రసాద్, ఎస్.శ్రీనివాసరావు, ఆపరేషన్ విభాగ ఏఈ ఎం.చంద్రశేఖర్, డీపీఈ (విజిలెన్స్) ఏఈఈ కె.కోటేశ్వరరావు, ఎం.సతీష్‌కుమార్, యు.శివశంకర్ పాల్గొన్నారు.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

హోమ్ లోన్ సెంటర్ (RACPC), గుంటూరు, 26-1-52, కన్నావారితోట, గుంటూరు-522004. ఇ-మెయిల్ : sbi.05256@sbi.co.in

స్వాధీనత ప్రకటన (రూల్ 8(1) ననుసరించి (స్థిరాస్తి కొరకు))

[illegible] తేది.08.07.2025 నాటికి రూ.27,07,062/- [illegible] తేది.08.07.2025 న డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.

[illegible] తేది 12.09.2025 న స్వాధీనత తీసుకోవడమైనది [illegible]

[illegible] తేది.08.07.2025 నాటికి రూ.27,07,062/- [illegible]

స్థిరాస్తి వివరములు

[illegible]

(రిజిస్టర్డ్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం.5379/2019, తేది.12.12.2019 ప్రకారం)

తేది : 12.09.2025
ప్రదేశం : గుంటూరు

సం/- అధీకృత అధికారి
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

మాదక ద్రవ్యాల వినియోగంపై అవగాహన

నెహ్రూనగర్: నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల వినియోగంపై అమరావతిరోడ్డులోని హిందూ ఇంజినీరింగ్ కాలేజీలోని విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఈగల టీం సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం.సునీల్‌బాబు హాజరయ్యారు. అనంతరం ఈగల్ పోస్టర్‌ను విద్యార్థులతో కలసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో బాలభవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్లమూడి శేఖర్‌బాబు, కాలేజీ డైరెక్టర్ డాక్టర్ పీఎం ప్రసాద్, సెక్రటరీ సీహెచ్ రామకృష్ణమూర్తి, ప్రిన్సిపాల్ సీహెచ్ సుబ్బరావు పాల్గొన్నారు.

అరండల్ పేటలో అంధకారం



అరండల్ పేట 14వ లైన్‌లో చీకట్లు

నెహ్రూ నగర్: నగరంలోని పలు ప్రాంతాల్లో వీధి లైట్లు సక్రమంగా వెలగకపోవడంతో వీధులన్నీ చీకటి మయంగా మారాయి. ముఖ్యంగా అరండల్ పేటలో పలు వీధుల్లో వీధిలైట్లు ఉన్నప్పటికీ కూడా సక్రమంగా జరగకపోవడంతో అంధకారంగా మారింది. అధికారులు స్పందించి వీధిలైట్లు వెలిగేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



వీధిలైట్ ఉన్నప్పటికీ వెలగని దృశ్యం

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

(గుంటూరు వెస్ట్)

9912220356

Office mail : sakshigntadvt@gmail.com